# ప్రయాణంలో పుస్తకాలుంటే?

* పి. యస్. మూర్తి *

అరగంట ఆలస్యమయినా యింకా రైలు రాలేదు. ఎండలో ప్లాటుఫారంమీద నుంచుని చూచిచూచి కళ్లు కాయలు కాచిపోతున్నాయి. తొలకరికి పచ్చిక బీళ్లల్లో పశువులమాదిరిగా వున్నారు జనం స్టేషన్‌నిండా—ఎప్పుడు రైలు వస్తుందా అని-మనుషులకన్నా మూడురెట్లు సామానులే వున్నాయి-అన్నీ దగ్గరగా అదునుకు సిద్ధంచేసుకుని చూస్తూనుంచున్నారు.

ఇంతలో స్థూలంగా మణుగులకొద్ది పెరిగిన బొర్ర , మోసుకుంటూవచ్చే పెద్దమనిషిలాగా నెమ్మదిగా చక్రాలు దొర్లించుకుంటూ స్టేషన్‌లో ప్రవేశించింది రైలు. ఇకచూచారు ? రైలుపెట్టెల నిండా రాశిపోసిన గండుచీమల్లా తలకాయలకు సందులేకుండా వుంది. ఇంతకీ రైలులో యెక్కటానికి ఒక్క తలుపయినా వేసిలేదు-అన్నీ తీసే వున్నాయి. అయితే రైలులో యెక్కటానికి దారేది ? చోటులేక తలుపులు పట్టుకునికూడా వ్రేలాడుతున్నారు జనం !

ఇక స్టేషనులో వున్నజనం ఆ రైలుపెట్టెల్లో అంతమంది మనుష్యుల్లో సామానులు తొక్కటానికి సందు లేక కంగారుగా కేకలు-పెడబొబ్బలు హోరెత్తిపోతున్నాయి. ఈ పెళ్ళిళ్ళ రోజుల్లో మనుష్యులకే కష్టంగా వున్న రైలుప్రయాణంలో ఒక్కొకరు అన్నేసి సామానులతో ప్రయాణం చేసి సలక్షణంగా చేరగలగటం ఎంతో గొప్ప శక్తీ, అదృష్టమూ వుంటేగాని సాధ్యమయే విషయం కాదు.

ఇక నామట్టుకు నేను చేతిలోవున్న వీ బుక్కుస్టాలులో కొన్నవీ పుస్తకాలు, పత్రికలూ-తో ఒక పెట్టెలో కాస్త తలకాయ దూర్చి యింకా సగాశరీరాన్ని యెట్లా అయితేం లోపల ప్రవేశపెట్టే సరికి-జేబులోవున్న పర్సు తడిమిచూచుకుని, మొత్తానికి ప్రపంచంలోవున్న దేవుళ్ళందరూ ఆ ఘడియను నన్ను కాస్త ఆశీర్వదించారేమోననిపించింది. బయట తీక్షణంగావున్న యెండతోపాటు లోపల ఉక్కతో కారే చెమటకు ఆరాటం ఇంతా అంతా కాకుండావుంది వంటికి. ఎట్లా అయితే ఏం చేస్తాం ? నేను చేయదలచుకున్న దూరప్రయాణాన్ని, అప్పుడు నేను వున్న పరిస్థితి తల్చుకుంటే గుండె బేజారెత్తిపోయింది.

నా పక్కింటు కిటికీదగ్గరగా కూచున్నాడు ఒకాయన. నేను ఆ పెట్టెలో ప్రవేశించిందిలగాయతూ నావంకే అదే పనిగా చూడటం మొదలెట్టాడు. ఆయన ధరించిన సన్నటి ఖద్దరు బట్టలు, వేళ్లకు వున్న ఉంగరాలు లగాయితు చొక్కాకు పెట్టుకున్న గుండీలవరకు పరిశీలిస్తే మొత్తానికి ఏదో డబ్బుగలవాడే ననిపించింది. కొంచెంసేపుండి మొఖంలోకి చూస్తూ చిరునవ్వు నవ్వుతూ "కూర్చుంటారా ?" అన్నాడు తన స్థూలశరీరాన్ని కాస్త పక్కలకు నొక్కుతూ. అట్లా నిలువుజీతం పుచ్చుకు నుంచునేకన్న అంతమంది నిల్చున్నవాళ్లల్లో ప్రత్యేకంగా నా కొక్కడికే లభించిన యీ సత్కారానికి యింకా సంతోషం కలక్కుండా వుంటుందా ?—ఆ పెద్దమనిషి తలచుకుని ఎట్లా అయితే బెంచీలమీద కూచున్నవాళ్ళను అటూయిటూ రెండుగద్దములు గదమటంతో నేను కూర్చోటానికి కాస్త అవకాశం కలిగింది.

నేను కూర్చున్నతర్వాత చల్లగా ఆ పెద్దమనిషి నా చేతిలోవున్న పుస్తకాలు ఒక్కొక్కటీ తీసుకుని తిరగేయటం మొదలెట్టాడు. అప్పుడు అర్థమయింది ఆ పెద్దమనిషి నన్నుగురించి అంత అవస్థపడి చోటిచ్చిన కారణం ! ఒత్తిడిగావున్న రైలు ప్రయాణంలో పుస్తకాలు వున్నవాళ్ళకుమాత్రం కూర్చోటానికి మంచిసన్మానం లభిస్తుందేమో ననిపించింది.

నాకు యెదురుగుండా ఒక కుర్రాడు కూచుని వున్నాడు. చిరిగిపోయిన బట్టలు, దైన్యాన్ని ప్రతిఫలించే మొఖమూ-అంతా బీదవాడులాగానే కనిపించాడు. చదువుకుందామని ఆపేక్షతో కాబోలు ఉండీవుండీ నా పక్కంట వున్న పెద్దమనిషి ఒడిలోని పుస్తకాన్ని పట్టుకుని "ఒక పుస్తకం ఇవ్వండీ" అన్నాడు.

"ఏమిటీ అంత చనువు?" అంటూ మొహం చిట్లించుకుని పుస్తకాన్ని లాక్కుని ఒళ్ళో పెట్టుకున్నాడు ఆ పెద్దమనిషి. ఆ కుర్రాడు తెల్లబోయి వూరుకున్నాడు. కాని నాకుమాత్రం ఆ కుర్రాడిమీద జాలి, పెద్దమనిషిమీద కోపమూ రెండూ వచ్చాయి.

ఆ పెదమనిషి పుస్తకాలు కొనుక్కోగల శక్తి వుండికూడా ఇటువంటి ప్రయాణంలో నాబోటివాడి పుస్తకాలకోసం ఇంత అవస్థపడి-పాపం ఆ కుర్రాడు ఏదో ఆపేక్షతో అడిగితే-అదీ 'నా' పుస్తకాలు యివ్వటానికి అంత కష్టం దేనికి? అంతగా నా అభ్యంతరమేమయినా వుంటుందనుకుంటే నన్నే అడగవచ్చుగా! ఆ పుస్తకాలు అన్నీ లాక్కుందామన్నంత కోపం వచ్చింది కాని యిటువంటివాడికే యీ పుస్తకాల వ్యసనం కలగటం మంచిదేమోనని వూరుకున్నా.

తర్వాత ఒక పుస్తకం తీసుకుని ఆ కుర్రాడికి యిచ్చా. కుర్రాడు సంతోషంతో చిరునవ్వు నవ్వాడు. ఆ పెద్దమనిషి మాడు మొహంతో నావంక చూసి తలకాయ వంచుకున్నాడు.

ఇంతలో ఏదో స్టేషను వచ్చింది. ఒళ్ళో పుస్తకాలు బెంచీమీదపెట్టి ఆ పెద్దమనిషి అతిప్రయాసమీద క్రిందకు దిగాడు. ఆయన లేవటం తరవాయి నన్ను పుస్తకాలు అయినా తీసుకోనీయకుండా, ఆ చోటుకోసం ముగ్గురు కుస్తీలు పట్టటం మొదలెట్టారు. చివరకు పుస్తకాలు అన్నీ తీసుకుని చూస్తే రెండురూపాయల ఖరీదు పుస్తకం లేదు! అప్పుడే ప్లాటుఫారం దాటి స్టేషనులోకి వెడుతున్న ఆ పెద్దమనిషి చేతిలో పైపంచి చాటుగా కనిపించింది. లేచి యెన్ని కేకలు వేసినా యింకెక్కడ పలుకుతాడు? మళ్లా క్రిందకు దిగితే తిరిగి రైలుయెక్కే ఆస్కారంలేదు! అరచి అరచి వూరుకున్నా. ఇంతలో రైలు కదిలింది. బెంచీమీదనుంచి లేవటంతో ప్రక్కంట నుంచున్నాయన ఆ చోటు కాస్త ఆక్రమించుకోవటంతో మళ్లా నిలువుజీతం పుచ్చుకోవలసివచ్చింది.

## సంపాదకీయ ధోరణి?

